క్లుప్తంగా

శివాలయంలో అఖండ భజన



అయిజ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని బింగుదొడ్డి గ్రామ శివాలయంలో భజన మండల సభ్యులు బుధవారం అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సూర్యోదయంతో మొదలైన అఖండ భజన గురువారం సూర్యోదయంతో ముగుస్తుంది. భజనలో వివిధ గ్రామాల భజన మండలి సభ్యులు భక్తి శ్రద్ధలతో భక్తి గీతాలు ఆలపించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి శరణుగోష, అష్టోత్తరాలతో మాలాధారులు క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీచుపల్లిలో సామూహిక వ్రతం



ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనదలచిన దంపతులు రూ.1,516 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు మిట్టల వద్ద శాంతినగర్ పశు వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఎద్దులు, ఆవులు, గేదెలకు వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. పశువులకు యజమానులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడారి ఓడలతో బతుకు బాట



ఉండవెల్లి: మండల కేంద్రంలో రెండు ఒంటెలు, గుర్రపు బండితో ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు వలస బాట పట్టారు. గ్రామాలు తిరుగుతూ ఒంటెలతో జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. పొట్ట కూటి కోసం రాష్ట్రాలు తిరుగుతున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన రైతులను విడుదల చేయాలి

కొల్లాపూర్: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తగదని లంబాడి హక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుడావత్ రవినాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంధువులకు పేదల భూములను కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణం.. ప్రమాద భరితం

- అధ్వానంగా రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా చెన్నిపాడు- మానవపాడు రహదారి

మానవపాడు: మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. బీటీరోడ్లు ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాల గుండా ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు కన్పించక ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకోని ప్రయాణించాల్సి వస్తుందంటున్నారు. చెన్నిపాడు, చిన్న పోతులపాడు, పెద్దపోతులపాడు, గోకులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లేపాడు గ్రామాల మధ్య రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాల బారి నుంచి రక్షించాలని పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి..



రోడ్లపై గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నిపాడు- మానవపాడు రోడ్డు మార్గం ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయాల్లో గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో ప్రయాణిస్తున్నాం.

– అయ్యన్న, మానవపాడు

అధికారులు చొరవ చూపాలి..



గోకులపాడు, మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు, గ్రామాలకు వెళ్లే రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉంది. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి నూతన రోడ్లు నిర్మించాలి.

– భీమరాజు, గోకులపాడు

టెండర్లు ఆహ్వానించిన స్పందన లేదు..

రోడ్లపై గుంతలు ఏర్పడి దెబ్బతిన్న విషయం వాస్తవమే. గత సంవత్సరం కాలం నుంచి మానవపాడు నుంచి పెద్దపోతులపాడు స్టేజి వరకు 6.9 కిలో మీటర్ల వరకు రూ.4 కోట్లుకు టెండర్ వేసిన స్పందన లేదు. ఎవరైనా టెండరు ప్రక్రియకు వస్తే రోడ్డు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఏఈ, మానవపాడు

ఆదిశిలా క్షేత్రంలో వేలం ఖరారు



ఆదిశిలా క్షేత్రంలో వేలం నిర్వహిస్తున్న ఈఓ సత్యచంద్రారెడ్డి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన టెంకాయల వేలం, తలనీలాల వేలాన్ని పాటదారులు దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి తెలిపారు. మల్దకల్ గ్రామానికి చెందిన పూజారి వెంకటేశ్వర్లు రూ.22,11,111కు టెంకాయల వేలం దక్కించుకోగా, తలనీలాల వేలాన్ని గుంటూరుకు చెందిన దాసరి రామకృష్ణ రూ.3,05,000లకు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది వేలం ద్వారా దేవాలయానికి అదనంగా ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరి, కవిత, ఆలయ నిర్వాహకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు..

ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం 11 గంటలకు దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముందు హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఐ ప్రత్యేక పూజలు..



సీఐకు మెమొంటో అందజేస్తున్న అధికారులు

ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గద్వాల సీఐ టంగుటూరు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఈఓ సత్యచంద్రారెడ్డిలు సీఐకు సాదర స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి సీఐకు తీర్థప్రసాదాలు, శేష వస్త్రంతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, ఆలయ నిర్వాహకులు చంద్రశేఖరరావు, దీరేంద్రదాసు, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అపోహలు నమ్మవద్దు



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి

అయిజ: ఇథనాల్ ఫ్యాక్టరీపై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని వాటిని నమ్మవద్దని టీపీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గాయత్రి రెన్యువబుల్ ఫ్యూయల్స్ పేరిట ఆర్డర్ విడుదల చేసిందని, గత సంవత్సరం జూలైలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డర్ కాపీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చినట్లు ఇతర పార్టీల నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ రాణెమ్మ, దేవేందర్, కిష్టారెడ్డి, షాలి, వీరేష్, గోవిందు, ఈరన్న, శివరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

విత్తు వేసేద్దాం.. చకచకా

- మొక్కజొన్న విత్తన యంత్రం



చెన్నిపాడులో హ్యాండ్ పుష్ సీడర్ ద్వారా మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న రైతు

మానవపాడు: రైతుల కోసం మార్కెట్‌లో ఆధునిక యంత్రాలు వస్తూనే ఉన్నాయి. పంటల సాగులో పెట్టుబడులతో తడిసి మోపెడౌతున్న రైతన్నకు నూతన యంత్రాలు కష్టాలు తీర్చే మంత్రంగా మారుతున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న సాగు చేయలంటే కూలీలతో రోజుకు మహిళలకు రూ.350 నుంచి రూ. 500 వరకు, పురుషులకు రూ. 500 నుంచి రూ. 600 వరకు కూలీ డిమాండ్ చేస్తున్నారు. ఈ లెక్కన రైతుకు ఎక్కువ మరింత ఖర్చు అవుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి హ్యాండ్ పుష్ సీడర్ అనే నూతన యంత్రం అందుబాటులోకి వచ్చింది. యంత్రానికి ఉన్న పెట్టెలో విత్తనాలు పోసి పొలంలో నడుపుకుంటూ వెళ్తుంటే నేలలో విత్తనాలు పడతాయి. ఇలా ఇద్దరు వ్యక్తులు కలిపి యంత్రం ద్వారా సూమరు 4 నాలుగు ఎకరాల్లో విత్తనాలు విత్తవచ్చు. కూలీలు అయితే ఎకరాకు దాదాపు రూ.5వేలు ఖర్చు అవుతుందని.. యంత్రం ద్వారా నాటే వారికి ఒక్కొక్కరికి రూ.1000 ఇచ్చిన నష్టం లేదని రైతులు పేర్కొన్నారు. మానవపాడు మండలం చెన్నిపాడుకు చెందిన రైతులు మౌలాలి, శాంతన్న చందుబాషా, చందు, ఇటిక్యాల నాగన్న, రామకృష్ణ, శాంతన్న ఈ యంత్రాలను వినియోగించి మొక్కజొన్న విత్తనాలు నాటుకున్నారు. ఈ యంత్రం ద్వారా ఖర్చుతో పాటు శారీరక శ్రమ తగ్గుతుందని తెలిపారు. ఓ పొలంలో రైతు విత్తనాలు నాటుతుండగా 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని వ్యయ ప్రయాసలు తగ్గుతాయని యంత్రాన్ని కొనుగోలు చేసిన రైతులు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

వనపర్తి రూరల్: మండలంలోని రాజపేట గ్రామానికి చెందిన బాలకిష్టయ్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.60వేలు, చిన్న బాలస్వామికి రూ.28వేలు, కొండన్నకు రూ.6 వేల చెక్కులను కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. చెక్కులు మంజూరు చేయించినందుకు కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలరాజుగౌడ్, ఎల్లపురాములు, తిరుపతయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: మండల కేంద్రానికి చెందిన వడ్డె శాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బుధవారం ఆమె భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పరుశరాం, నాగరాజు, అంజి, వెంకటన్న, ఉశేన్ పాల్గొన్నారు.

850 ఇళ్లలో సర్వే పూర్తి



రాజోళి: మండలంలో బుధవారం 850 ఇళ్లల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో అధికారులు సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా నిర్దేశించిన వివరాలు సేకరించి నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



ధరూరు: కులం పేరుతో మహిళను దూషించడమే కాకుండా, ఇంటిపైకి వచ్చి దాడికి పాల్పడిన 14 మందిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ర్యాలంపాడులో బాధిత దళిత మహిళ కుటుంబ సభ్యులను బుధవారం కలిశారు. మహేశ్వరిపై గత నెల 28న రాత్రి 8.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన బోయ కులస్తులు 14 మంది కులం పేరుతో దూషించడమే కాకుండా ఇంటిపై దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆత్మకూర్: రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఆత్మకూర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ సంతోష, కోచ్ ఖాదర్ తెలిపారు. బుధవారం రాత్రి నారాయణపేట జిల్లా ధన్వాడలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఎంపికల్లో ఆత్మకూర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, బిందుమాధవి, అమృత, సహస్ర అత్యంత ప్రతిభను కనబర్చారన్నారు. ఈ నెల 16న మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఆత్మకూర్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు, స్థానికులు విద్యార్థులను అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే విజయుడు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్, సీఎం సహాయ నిధి చెక్కులు బుధవారం అందజేశారు. రాజోళి, వడ్డేపల్లి, అలంపూర్, ఉండవెల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.98,11,368 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు



ధరూరులో డీటీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

రాజోళి: బీసీలోని కురుమలు తాము ఎస్సీ జాబితాలో ఉన్న మాదాసి, మాదారి కురువలమంటూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మార్పీస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న అన్నారు. కులగణలో అధికారులు తప్పులకు తావివ్వకుండా సర్వే చేపట్టి వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ రామ్మోహన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గత కొంత కాలంగా కొందరు తప్పుడు దారిలో ఎస్సీ సర్టిఫికెట్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్ జిల్లాలో మాదాసి, మాదారి కురవలు లేరని నివేదిక ఇచ్చారని.. దానిని కూడా తహసీల్దార్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ రాజు, ఎమ్మార్పీస్ నాయకులు ఏసేపు, రాజశేఖర్, ధనుంజయ, రాజాబాబు, రమణ, దేవన్న, గోవిందు పాల్గొన్నారు.

డీటీకి ఫిర్యాదు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు..

ధరూరు: సమగ్ర కటుంబ సర్వేలో బీసీ–బీలో ఉన్న కురువ కులస్తులు మాదాసి కురువలుగా కులగణనలో నమోదు చేయిస్తూ అధికారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందంటూ ఎమ్మార్పీస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ అలివేలు మంగమ్మకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్నపాడు ఆంజనేయులు, చింతరేవుల ఆంజనపేయులు, గుడిసె తిమ్మప్ప, దోర్నాల నర్సింహులు, అల్వలపాడు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో తప్పులకు తావివ్వొద్దు..

శాంతినగర్: ప్రభుత్వం చేపట్టిన కులగణనలో తప్పులకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న మాదిగ, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ ఐజరాజు మాదిగ వడ్డేపల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో కొందరు బీసీ కుర్మలు తాము ఎస్సీ జాబితాలో ఉన్న మాదాసి/మాదారి కుర్మలం అంటూ గత కొంతకాలంగా అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమ మార్గంలో ఎస్సీ సర్టిఫికెట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాంటి తప్పిదాలకు తావివ్వకుండా పారదర్శకంగా కులగణన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ధనుంజయ, రాజబాబు, రమణ, దేవన్న, గోవిందు, రాజులు పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేటీదొడ్డి: ధాన్యం కోనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కొండాపురం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అకాల వర్షాల వలన తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో భాదకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొగుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రహల్లాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కమిటీ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వర్

అయిజ: బీజేపీకి సంబంధించి పట్టణ కమిటీని ఏర్పాటు చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో కొత్త కమిటీలు ఏర్పాటు చేసి 26 కొత్త బూత్ స్థాయి కమిటీల ద్వారా పట్టణ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భగత్ రెడ్డి, లక్ష్మణాచారి, లక్ష్మణ్ గౌడ్, చిన్ని కృష్ణ, ఇబ్రహీం, రఘు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి



షాబాద్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేష్

ఇటిక్యాల: మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళా బృందం సభ్యులు డైల్- 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలపై మాటలు, పాటల రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడిన వారు వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. మైనర్ బాలికలను వేధిస్తే పోక్సో చట్టం ద్వారా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ సేవలపై అవగాహన



ఎల్‌ఐసీ సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎర్రవల్లి: మండల కేంద్రంలో బుధవారం ఎల్‌ఐసీ సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళా బృందం సభ్యులు, సిబ్బంది ఎల్‌ఐసీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బంగి రాంగారావు మాట్లాడుతూ.. ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా గ్రామ గ్రామానికి చేరుకుని పేదవారికి సైతం బీమా సౌకర్యాన్ని కల్పించిందన్నారు. అదే విధంగా నిరుద్యోగులకు సైతం ఎల్‌ఐసీ ఏజెంట్ రూపంలో ఉపాధి కల్పించిదన్నారు. దేశ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం, పలు పథకాలను అమలు చేయడంలో ఎల్‌ఐసీ ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బషీర్, రాఘవేంద్ర, చైతన్య, లక్ష్మీకాంత్, కిశోర్‌కుమార్, చంద్రశేఖర్, రంగయ్య, శైలేష్, కళాకారులు, ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల బి. ఐస్వరాజు - 9666283739
అలంపూర్/అయిజ ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్ 9951602829
జబ్బర్ లాల్ : 9553955603